ప్రజాశక్తి

సోమవారం 21 ఆగస్టు 2023 5 అనంతపురం

జడ్‌పి సిఇఒ భాస్కర్‌రెడ్డి సస్పెన్షన్

మరికొందరిపైనా చర్యలకు రంగం సిద్ధం ?
వెంటాడుతున్న ఓటర్ల తొలగింపు తప్పిదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లా పరిషత్ సిఇఒ కె.భాస్కర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఓట్ల తొలగింపులో నిబంధనలు పాటించని కారణంగా ఆయనపై వేటు పడింది. ఈ మేరకు చీఫ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఈనెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో 2020, 2021 సంవత్సరంలో జరిగిన ఓటర్ల జాబితా తయారీలో 1116 ఓట్లను తొలగించారు. ఆ సమయంలో కె.భాస్కర్‌రెడ్డి అక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేశారు. ఈ విషయంపైనే ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించిన విషయం తెలిసిందే. దీనిపై తదుపరి విచారణ సైతం చేపట్టింది. ఈ విచారణలో బాధ్యులుగానున్న వారిపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇది వరకే ఇద్దరు బిఎల్‌ఒలపై వేటు పడింది. మరికొంత మందిపైనా వేటు పడే అవకాశాలున్నట్టు సమాచారం.

జడ్‌పి సిఇఒ భాస్కర్‌రెడ్డి

వెంటాడుతున్న తప్పిదాలు

ఓటర్ల జాబితాలో జరిగిన తప్పిదాలు వరుసగా ఉద్యోగులను వెంటాడుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఇద్దరు బిఎల్‌ఒ (బూత్ లెవల్ అధికారులు) సస్పెన్షన్‌కు గురయ్యారు. చిలకురికి గ్రామంలో మూడు వేల ఓట్లు తొలగించారని ఆరోపిస్తూ ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అప్పటి జిల్లా కలెక్టరు ఇద్దరు బిఎల్‌ఒలపై సస్పెన్షన్ వేటు వేశారు. దాని తరువాత కేంద్ర ఎన్నికల సంఘం ఉరవకొండలో పర్యటించి ఆర్డీవోతోపాటు, తహశీల్దారు సమక్షంలో విచారణ జరిపింది. ఈ విచారణ అనంతరం మరికొంత మందిపై చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా జెడ్‌పి ఇసిఒ భాస్కర్‌రెడ్డిపై వేటు పడింది. ఆయన కంటే ముందున్న జెడ్‌పి సిఇఒ శోభా స్వరూప రాణిపైనా వేటు పడే అవకాశాలున్నట్టు అధికారవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈమెతోపాటు మరో ఇద్దరు ఇఒఆర్‌డిలపైనా చర్యలుండే అవకాశాలున్నట్టు సమాచారం.

ఓటర్ల సర్వేపైనా ఇద్దరిపై వేటు

ఓటర్ల సర్వేలోనూ ఇద్దరిపై వేటు పడింది. వజ్రకరూరు మండలంలో ఓటర్ల సర్వే ప్రారంభించకపోవడంపై జిల్లా కలెక్టరు గౌతమి సీరియస్ అయ్యారు. ఈసందర్భంగా ఇద్దరిని సస్పెన్షన్ చేశారు. ఇలా ఎన్నికల్లో తప్పిదాలపై ఒకరి తరువాత ఒకరిపై వేటు పడుతుండటంతో ఎన్నికల విధులంటేనే సిబ్బందిలో గుబులు రేగుతోంది. ఏ చిన్న తప్పు జరిగినా ఇబ్బందులు తప్పవన్న భయం నెలకొంటోంది.

ఇందిరమ్మకాలనీలో కనీస సౌకర్యాలు కరువు

విద్యుత్ స్తంభాలు లేకపోవటంతో కర్రల సహాయంతో ఇంటికి విద్యుత్‌వైరు తీసుకున్న దృశ్యం

రోడ్లు, డ్రయినేజీల ఏర్పాటులో నిర్లక్ష్యం
కర్రలసాయంలో విద్యుత్ లైను
ఇబ్బందుల్లో కాలనీవాసులు
పట్టించుకోని పాలకులు, అధికారులు

పేదలకు గూడు కల్పిస్తామని వారి నివాసా కాలనీల్లో వెలుగుల నింపుతామని సకల సదుపాయాలు కల్పిస్తామని పాలకులు ఇచ్చే హామీలు నీటి మీద రాతలుగా మిగులుతున్నాయి. పాలకులు ఎవరైనా ప్రభుత్వాలు ఎన్ని మారినా పేదలకు కన్నీళ్లే మిగులుతున్నాయి. 16 సంవత్సరాలుగా ఓ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. రహదారులు, విద్యుత్ సదుపాయం, మురుగు కాలువలు లాంటి కనీస సదుపాయాలను సైతం కల్పించలేక పోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తమకు సదుపాయాలు కల్పించాలంటూ పేద జనం ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టు ఏళ్ల తరబడి తిరుగుతున్నా కనికరించే వారు కనిపిండం లేదు. దీంతో కనీస సదుపాయాలు లేని కాలనీ ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన దుస్థితి దాపురించింది.

కనీస సౌకర్యాలకు నోచుకోని పూలకుంట ఇందిరమ్మకాలనీ

ప్రజాశక్తి-హిందూపురం

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హిందూపురం పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉండే రూరల్ మండలం పూలకుంట పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ కాలనీనిఏర్పాటు చేశారు. దాదాపు 100 మందికి పైగా ఇంటి పట్టాలను ఆ సమయంలో ప్రభుత్వం మంజూరు చేసింది. కాలనీలో సౌకర్యాలు కల్పించక పోయినప్పటికీ ఏదో ఒక రోజు కల్పిస్తారన్న నమ్మకంతో దాదాపు 50 మంది గృహాలను నిర్మాణం చేసుకుని చేసుకుని జీవనం చేస్తున్నారు. ఇప్పటికి 16 సంవత్సరాలు గడిచినా ఇందిరమ్మ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. విధి లేని పరిస్థితుల్లో ఎలాంటి వసతులు లేకపోయినప్పటికి అక్కడే నివాసం వుంటున్నారు. రోడ్లు లేవు, కాలువలు లేవు, కనీసం విద్యుత్ సౌకర్యం సైతం లేకపోయినప్పటికి నివాసం ఎలా వుండాలి అంటూ ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో అయితే ఈ ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా వుంటుంది. రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్లపై నిలుస్తుంది. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ఈ ప్రాంత ప్రజలు అంటు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇది చాలదన్నట్లు విష కీటకాల కాటుకు బలి అవుతున్నారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో రోడ్డులో ఉన్నా విద్యుత్ స్తంభాల నుంచి కర్రలను ఏర్పాటు చేసుకుని ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. వీధి దీపాలు లేక పోవడంతో విష కీటకాలు ఎప్పుడు ఎవరిని కరుస్తాయోనన్న భయందోళనతో ఆ ప్రాంత ప్రజలు జీవనం చేయాల్సిన దుస్థితి దాపురించింది.

రోడ్డు సౌకర్యం లేని దృశ్యం

సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు

గ్రామ సర్పంచుగా ఎంపిక అయినప్పటి నుంచి ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించాలని ప్రతి మండల సమావేశంలోను అధికారులకు, పాలకులకు వివరిస్తున్నా. అయితే ఏ ఒక్కరు పట్టించు కోవడం లేదు. ఇప్పటి వరకు ఆరు సమావేశాలు జరిగాయి. మొదటి సమావేశం నుంచి సమస్యను సభ దృష్టికి తీసుకువస్తున్నా ఇప్పటికి పరిష్కరించలేదు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు, ఇతర నిధులు అయిన పంచాయితీలకు వస్తే వాటి ద్వారా సౌకర్యాలు కల్పించడానికి సాధ్యం అవుతుంది. ఆ నిధులు సైతం రాలేదు. పంచాయతీ సాధారణ నిధుల్లో నుంచి సుమారు రూ.2.50లక్షలు వెచ్చించి నీటి సౌకర్యాన్ని కల్పించా. జగనన్న లే అవుట్‌లో నివాసాలు లేక పోయినప్పటికి ప్రతి 10 అడుగులకు ఒక విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేశారు. అయితే నివాసాలు ఉన్న ఇందిరమ్మ కాలనీలో ఇప్పటికి కరెంటు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మంజునాథ్.
గ్రామ సర్పంచు

సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం

ఇందిరమ్మ కాలనీలో కనీస సౌకర్యాలు లేక పోయినప్పటికి, అద్దెలు చెల్లించే స్థోమత లేక ఇక్కడే నివాసం ఉంటున్నాం. విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో ప్రధాన రహదారి నుంచి తమ నివాసానికి దాదాపు రూ.6వేలు ఖర్చు చేసి కర్రల సహాయంతో వైరు వేసుకుని కరెంటు తీసుకున్నాము.

అంజినమ్మ,
కాలనీవాసి

నివాసం ఉండలేక పోతున్నాం

కాలనీలో రోడ్డు, మురుగు కాలువలతో పాటు కనీస సౌకర్యం లేక పోవడంతో నివాసం ఉండలేక పోతున్నాం. అయితే ఒక్కరి సంపాదనపై అందరు జీవనం చేయాలి. అద్దెలు చూస్తే విపరీతంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అప్పులు చేసి నివాసం ఏర్పాటు చేసుకున్నాము.

రేష్మా,
కాలనీవాసి

సౌకర్యాల కల్పనకు తగిన చర్యలు

పూలకుంట గ్రామ పంచాయతీ పరధిలోని ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. సమస్యను గ్రామ సర్పంచి తమ దృష్టికి తీసుకువచ్చారు. న్ని శాఖ అధికారులతో చర్చించి సౌకర్యాలు కల్పిస్తాం.

నరేంద్ర కుమార్,
ఎంపిడిఒ

సత్ప్రవర్తనతో జీవించండి

ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పాత నేర పంథాకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని కఠోర హత్యలు, హీనమైన నేరాలకు పాల్పడి ఏ కేటగిరీలో ఉన్న జిల్లాలోని రౌడీషీటర్లకు ఎస్పీ కె. శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం స్థానిక పోలీసు పరేడ్ మైదానానికి రౌడీషీటర్లను పిలిపించిన ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరి గత నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఎస్పీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు ఏ చెడు పని చేసినా పోలీసులకు తెలిసిపోతుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పాత పంథా పునరావృతమైతే పీడీ యాక్టు, జిల్లా బహిష్కరణ తథ్యం అని హెచ్చరించారు. డబ్బు కోసం హత్యలకు పాల్పడే కిరాయి హంతకులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు బుద్ధిగా జీవించాలని, లేదంటే చట్టపరంగా ఉక్కుపాదం మోపుతామని అన్నారు. ప్రతి రౌడీషీటర్ కదలికలపై లోతుగా నిఘా వేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హద్దుదాటి అల్లర్లు, అలజడులకు పాల్పడినా చెడు నడతతో ఇతరుల్ని ఇబ్బంది పెట్టినా నేరాలకు ఒడిగట్టినా ఎవరిని ఉపేంక్షించవద్దని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జి.ప్రసాదరెడ్డి, బివి.శివారెడ్డి, సిఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, విజయభాస్కర్ రెడ్డి, రెడ్డెప్ప, శివరాముడు, ప్రతాప్ రెడ్డి, అస్రార్ బాషా, నరేంద్రరెడ్డి, నాగర్జునరెడ్డి, ఆర్ఎస్ఐ రాజశేఖరరెడ్డి, ఎస్ఐలు సుధాకర్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, రుష్యేంద్రబాబు, దిలీప్ కుమార్, శ్రీనివాసులు, దుగ్గిరెడ్డి, రాజశేఖర్, గంగాధర్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

శిలాఫలకాన్ని ఆవిష్కరణలో ఎంపీ, ఎమ్మెలే, జెడ్‌పి ఛైర్‌పర్సన్, కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహనీయుల త్యాగాలను స్మరించుకుందామని ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేపట్టిన శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ తలారి రంగయ్య, జిల్లా కలెక్టర్ గౌతమి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ మేయర్ వసీం, సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. దేశ రాజధానికి తరలించేందు కోసం జిల్లా నుంచి సేకరించిన మట్టి కలశాన్ని ఎంపీకి జిల్లా కలెక్టర్ అందజేశారు. అనంతరం భూమికి వందనం చేస్తూ పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం మాజీ జవాన్‌ల కుటుంబ సభ్యులను సన్మానించారు. వసుధకు వందనం కింద వారు మొక్కలు నాటారు.

కలెక్టరేట్ పునర్‌నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరణ

కలెక్టరేట్ పునర్నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఎంపీ, కలెక్టర్ ఇతర ప్రముఖులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కలెక్టరేట్ భవనం వంద సంవత్సరాల పురాతనమైనదని, బ్రిటిష్ వారి నుంచి వారసత్వంగా వచ్చిందని చెప్పారు. ఇలాంటి భవనం పెచ్చిలూడిపోయి శిథిలావస్థకు చేరుకుంటుండడంతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మరమ్మతులు చేయాలని అడిగారని చెప్పారు. దీంతో కలెక్టరేట్ మరమ్మతుల కోసం ఎంపీ ల్యాండ్స్ నుంచి అవసరమైన నిధులు కేటాయించామన్నారు. కలెక్టర్ గౌతమి చొరవ తీసుకుని కలెక్టరేట్ మరమ్మతు పనులు చేపడుతుండడం అభినందనీయమన్నారు. కలెక్టరేట్‌లో లిఫ్ట్ ఏర్పాటు, ఇతర వసతులు కల్పించడం కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ దేశానికి సేవ చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ గాయత్రి దేవి, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పాదయాత్రను జయప్రదం చేయండి

పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

హంద్రీనీవా కాలువ నుంచి మండలంలోని గ్రామాల రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22 నుంచి 24వతేదీ వరకూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాగులపాడు సమీపంలోని హంద్రీనీవా కాలువ తూము నుంచి పిల్ల కాలువలు ఏర్పాటు చేసి తాగు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు అనేకసార్లు హామీ ఇచ్చినా విస్మరించారన్నారు. అంతేగాకుండా ప్రస్తుత ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి పిల్ల కాలువలు ఏర్పాటు చేసేందుకు భూమిపూజ కూడా చేశారని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వాన్ని ఎండగడుతూ తాగు, సాగునీటి సాధన కోసం పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 24న పాదయాత్ర ముగింపు సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌తోపాటు జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, జగ్గలి రమేష్, మల్లికార్జున, ఓబులయ్య, సూరి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్‌వి. మాధవరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో శాంతి భద్రతలకు ఎవరైనా ఎలాంటి విఘాతం కలిగించిన ఉపేక్షించేది లేదని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయంలేకుండా జీవించడానికి అనువైన వాతావరణం కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. హత్యలు, నేరాలకు పాల్పడిన ఏ కేటగిరీలో ఉన్న రౌడీషీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చామని అలాంటి వారు తిరిగి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే జిల్లా బహిష్కరణ చేపడతానని హెచ్చరించారు. జిల్లాలో రౌడీ షీటర్ల కదిలకపై నిఘా ఉంచామని హద్దు దాటి అల్లర్లు అలజడలు పాల్పడినా, చెడుతనంతో ఇతరులకు ఇబ్బంది పెట్టిన ఉపేక్షించబోమని తెలిపారు. జిల్లాలోని పోలీసులు ప్రజల సమస్యలు పరిరక్షించే విధంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని దానికి అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. జిల్లాలో యువత మద్యానికి మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ఇటీవల జిల్లాలో గంజాయి విక్రయాలు పెరిగిపోతున్న నేపథ్యంలో మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: గంజాయి అక్రమ రవాణాపై జిల్లా వ్యాప్తంగా గట్టి నిఘా ఉంచాం. జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా గంజాయి క్రయవిక్రయాలు తగ్గాయి. గంజాయి సేకరించినా లేదా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎక్కడ క్రయవిక్రయాలు జరగలేదు. ఒరిస్సా రాష్ట్రం నుండి ఆంధ్ర ప్రదేశ్‌కు సరఫరా అవుతుండేది. దానికి అడ్డుకట్ట వేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టాం. గడిచిన ఐదు నెలలలో11 గంజాయి కేసులు నమోదు చేసి 54 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 51.62 కేజీల గంజాయిని సీజ్ చేశాం.

ప్ర : జిల్లాలో పెట్రేగిపోతున్న అసాంఘిక శక్తులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై ఉక్కు పాదం మోపుతున్నాం. మద్యం అక్రమ రవాణా, గుట్కా,

మట్కా, నాటుసారా గ్యాంబ్లింగ్, గంజాయి వంటివి అక్రమ రవాణా సాగించే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా వివిధ నేరాలలో పట్టుబడిన 4293 వాహనాలను సీజ్ చేశాం. వాటిలో 159 వాహనాలను పబ్లిక్ యాక్షన్‌లో వేలం వేసి వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖాతాలలో జమ చేశాం. 2021 సంవత్సరం 970 నాటుసారా కేసులు నమోదు కాగా 625 మందిని రిమాండ్ పంపాం. 2022లో 714 కేసుల్లో 295 మంది నిందితులపై కేసు నమోదు చేశాం. గడచిన ఐదు నెలలలో మట్కా ఆడే వారిపై 215 కేసులు గాను 376 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 36 85,661 రూపాయల నగదు సీజ్ చేశాం. క్రికెట్ బెట్టింగులపై 27 కేసులు నమోదు చేయగా 118 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 68,83195 రూపాయలు స్వాధీనం చేసుకున్నాం. చేశాం. గ్యాంబ్లింగ్ ఆడే వారిపై 1229 కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి7681888 రూపాయలు సీజ్ చేశాం.

ప్ర : జిల్లాలో శాంతిభద్రతలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : సత్యసాయి జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచాం. అవసరమైనచోట్ల సిబ్బందిని ఏర్పాటు చేసి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపడుతున్నాం. గడచిన ఐదు నెలల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 365 కేసులు నమోదు చేశాం. వారి వాహనాలను సీజ్ చేశాం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 711 రోడ్డు ప్రమాదాలపై కేసులు నమోదు చేయగా వాటిలో 449 మంది మృతిచెందారు. 838 మందికి గాయాలయ్యాయి.

సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

4) నాటు సారా, కర్నాటక మద్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా నాటుసారా, కర్నాటక మద్యాన్ని అరికట్టడానికి పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది. అంతర్రాష్ట్ర సరిహద్దులలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి నిఘా ఉంచాం. శ్రీ సత్య సాయి జిల్లా సరిహద్దు ప్రాంతంగా కర్నాటక 250 కిలోమీటర్ల పరిధిలో ఉన్నందున జిల్లాలో మద్యం అక్రమ రవాణా చేయడానికి అనుకూలంగా ఉంది. దీంతో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను తనిఖీలు చేసి పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 20 గ్రామాల్లో నాటుసారా తయారు చేసే వారిని గుర్తించాం. వారిపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నాటుసారా తయారు చేయకుండా దానిని వినియోగించకుండా చర్యలు చేపడుతున్నాం.

ఉత్తమ కవిత్వానికి గీటురాయి 'కొత్తపల్లి' పురస్కారం

పురస్కార ప్రధానోత్సవ సభలో వక్తలు

కొత్తపల్లి నరేంద్రబాబు పురస్కార గ్రహీతను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

ఉత్తమ కవిత్వానికి గీటురాయిగా కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం అనంతపురంలోని సెంట్రల్ లైబ్రరీలో డాక్టర్ శాంతి నారాయణ అధ్యక్షతన కొత్తపల్లి నరేంద్రబాబు పురస్కార ప్రధానోత్సవ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా పురస్కారానికి ఖీరాలకు చెందిన రచయిత కవి పి.శ్రీనివాస్ గౌడ్ రచించిన 'చిన్న చిన్న సంగతులు' కవితా సంపుటి ఎంపిక కాగా 2023 సంవత్సర పురస్కారానికి గూండ్ల వెంకటనారాయణ అనే యువకవి రచించిన 'ఇయ్యాల ఉల్లో' సంపుటి ఎంపికైంది. వీరిద్దరికి ఒకే వేదికపై పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ రాయలసీమ కవిత్వం గొప్ప కృషిని సాధించిందన్నారు. ఇందుకోసం ఎందరో కవులు కృషి చేశారన్నారు. ఆ కోవలో ఇప్పటి యువకవులు కూడా నడుస్తూ ఉండడం సంతోషదాయకమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ సన్నేపోయడు నుంచి నేటితరం తెలుగు సాహిత్యంలో వచ్చిన మలుపుల్నీ ఆ మలుపులో నుంచి పుట్టుకొచ్చిన కవితా ఉద్యమాల్ని బెలుతూ నేటి కవులు వర్తమాన సమాజంలోని పోకడలను పరిశీలిస్తూ వాటిని కవిత్వం చేసే ప్రయత్నం చేయాలన్నారు. విశిష్ట అతిథి వెంకటకృష్ణ మాట్లాడుతూ నరేంద్రబాబు పురస్కార గ్రహీతల కవిత్వం కాలానికి నిలబడే కవిత్వం అన్నారు. అలాగే సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ నరేంద్రబాబు గొప్పకవి అన్నారు. ఆయన రాసిన కవిత్వం ఒక పుస్తకంగా తీసుకురావాల్సిన బాధ్యత, అవసరం ఎంతైనా ఉందన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ హిందీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జివి రత్నాకర్ మాట్లాడుతూ పురస్కారం వైపు రెండు రాష్ట్రాలు చూస్తున్నాయని ఈదఫా ఈ అవార్డును తీర్చిదిద్దిన నిర్వాహకులు కొత్తపల్లి సురేష్‌ని అభినందించారు. ఆత్మీయ అతిథి శశికళ మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ అవార్డు ఒక నిబద్ధతతో ఇస్తూ ఉండడం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని నిర్వాహకుల్ని అభినందించారు. ఆత్మీయ అతిథి తూమచర్ల రాజారాం మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో వస్తున్న ఉత్తమ కవిత్వాన్ని కచ్చితంగా తూనిక పట్టే అవార్డుగా కొత్తపల్లి నరేంద్రబాబు అవార్డు నిలుస్తోందని కొనియాడారు. అవార్డు పొందిన కవితా సంపుటాలపై సుగొని రామకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్ అంకె చక్కని సమీక్ష చేశారు.ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం అడ్మిన్ కొత్తపల్లి నరేంద్రబాబు, అవార్డు వ్యవస్థాపకులు కొత్తపల్లి సురేష్, అన్న అశోక్‌కుమార్, పోతుల రాధాకృష్ణ, కోటిగారి వన్నప్ప, డాక్టర్ జెన్నే ఆనంద్‌కుమార్, షేక్ నబీరసూల్, చెట్ల ఈరన్న, మిద్దె మురళీకృష్ణ, చేగువేరా హరి, వంశీ, వలస రమేష్, చిలుకూరి దీవెన, ప్రగతి, అడ్వకేట్ శరత్, లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ, ఉపాధ్యాయ మిత్రులు,తదితర సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తదితరులు

వాల్మీకి మహర్షి అందరివాడు

ప్రజాశక్తి-అనంతపురం

విశ్వమంతా ప్రభావితం చేయగలిగే వాల్మీకి మహర్షి అందరివాడు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాల్మీకి ఉత్సవ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచానికి శ్రీరామచరిత్ర కనులవిందుగా అందజేసిన గొప్ప రామభక్తుడు వాల్మీకి మహర్షి అన్నారు. ప్రతి ఒక్కరూ రాముడి విధానంలోకి రావాలని కోరుకున్నారన్నారు. రాముడిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రపంచానికి చూపిన వ్యక్తి వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఆయన విధానాలను అవలంబించి ప్రతి ఒక్కరూ మానవతా మూర్తులుగా, గొప్ప రామ భక్తులుగా నిలవాలన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి రామాంజనేయులు, ఆదినారాయణ, కన్వీనర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రా శివయ్యకు ఎమ్మెల్యే నివాళి

అనంతపురం : అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందిన రూరల్ మండలం ఆకుతోటపల్లి సర్పంచి చిత్రా గురుప్రసాద్ తండ్రి చిత్రా శివయ్యకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా మృతదేహానికి పూలమాల వేసి అంజళి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతిచెందిన సుబ్బయ్య

నార్పల : మండల కేంద్రంలోని క్రాసింగ్‌లో ఉన్న ఓ రెస్టారెంట్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని చౌడమ్మ కట్ట వీధికి చెందిన కుమ్మర సుబ్బయ్య (65) సమీప పొలాల్లోకి కూలి పనికి వెళ్లి వస్తుండగా నాయనపల్లి క్రాసింగ్ నుంచి ధర్మవరం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో సుబ్బయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుబ్బయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు..

రైలింజిన్ రిపేరి చేస్తూ ఉద్యోగి దుర్మరణం

మృతిచెందిన శాంతారామ్ (పాతచిత్రం)

గుంతకల్లు : పట్టణంలోని రైల్వే డివిజన్ కేంద్రంలోని లోకోషెడ్‌లో విధి నిర్వహణలో భాగంగా రైలింజిన్ మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు ఫ్యాన్ రెక్కల్లో ఇరుక్కుని శాంతారామ్ (50)అనే ఉద్యోగి ముక్కలు ముక్కలై దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సహచర ఉద్యోగులు రైల్వే పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రైల్వే లోకోషెడ్‌లో శాంతారామ్ గ్రేడ్‌వన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. యథావిధిగా విధులకు హాజరైన శాంతారామ్ రైలింజిన్‌లోని ప్రెషర్ ఫ్యాన్‌లో రబ్బర్లను మారుస్తుండగా గమనించని మరో ఉద్యోగి ఇంజిన్‌ను ఆన్ చేశాడు. దీంతో ఫ్యాను రెక్కల్లో ఇరుక్కుని శాంతారామ్ ముక్కలు ముక్కలై అక్కడికక్కమే మృతిచెందాడు. గమనించిన సహచర ఉద్యోగులు వెంటనే వెళ్లి ఇంజన్ ఆఫ్ చేశారు. అయితే ఇంజిన్ ఆన్‌చేసే సమయంలో లోకో పైలట్ అన్నింటినీ పరిశీలించాల్సి ఉండగా ఎందుకు అంత నిర్లక్ష్యం చేశాడో అర్థం కావడం లేదని షెడ్‌లోని ఉద్యోగులు తెలిపారు. సమాచారం మేరకు రైల్వే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దుర్ఘటనపై సమీక్ష చేశారు. జీఆర్పీ పోలీసులు మృతదేహం ముక్కలను సేకరించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆదివారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి రామాంజనేయులు కుమారుడు ఆనంద్ (22) పెద్దవడుగూరు మండలం జి.వెంకటాపల్లికి వెళ్లే రహదారి పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియ రాలేదన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుడిపై దాడి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన రైల్వే కాంట్రాక్టు కార్మికుడు మురళీకృష్ణపై తోటి కార్మికులు ఆదివారం దాడి చేశారు. మురళీకృష్ణకు ఇంటి పక్కలో ఉన్న రాజు, శీనాకు స్థల వివాదం ఉంది. ఈక్రమంలో రైల్వే డీజిల్ షెడ్ లో విధి నిర్వహణలో ఉన్న మురళీకృష్ణపై రాజు, శీనా కలిసి ఇనుప రాడ్‌తో దాడి చేసి గాయపరిచారు. గాయపడ్డ ఆతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కరిగానిపల్లి సర్పంచి మృతి

మృతిచెందిన మల్లికార్జున (పాతచిత్రం)

కుందుర్పి : మండల పరిధిలోని కరిగానపల్లి సర్పంచి కె.మల్లికార్జున (55) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు ఉదయం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే తనయుడు మారుతీచౌదరి, జెడ్పిటిసి రాధాస్వామి, మాజీ సర్పంచి చిత్రలింగప్ప, పలువురు సర్పంచులు, ఎంపిటిసీలు ఉన్నారు.

ఖాన్‌సాబ్ మృతి సమాజానికి తీరని లోటు

ఖాన్ సాబ్ సంతాప సభలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సీనియర్ జర్నలిస్ట్ ఉర్దూ సియాసత్ దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ జహీరుద్దీన్ అలీఖాన్ మరణం సమాజా నికి తీరని లోటని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ ప్రజాసంఘాల ప్రతిని ధులు అన్నారు. ఆదివారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో మైనార్టీ డెవలప్‌మెంట్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేసి ఖాన్ సాబ్‌కు నివాళులర్పించారు. తొలుత ముస్లిం మత పెద్దలు జహీరుద్దీన్ ఖాన్ ఆత్మకు శాంతిని చేకూర్చే విధంగా పవిత్ర ఖురాన్ పఠణంతో ప్రత్యేక దువా ప్రార్థనలు, శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక (ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్) కన్వీనర్, ప్రముఖ న్యాయవాది ఎస్. అబ్దుల్ రసూల్, మైనార్టీ డెవలప్‌మెంట్ ఫోరం ఉభయ జిల్లాల కన్వీనర్ వై.ఫక్రుద్దీన్, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, ఇన్సాఫ్ నాయకులు అల్లిపీరా, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఆల్ మేవా నాయకులు షేక్షావలి, మౌలానా రఫీక్, హఫీజ్ అమీర్, జమీయతే ఉలుమా-యే-హింద్ ప్రతినిధి హఫీజ్ ఉస్మాన్, రెయిన్ బో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సద్దాం, ఉర్దూ బాష అభివృద్ధి సంఘాల ప్రతినిధులు జిలాన్, అశ్రఫ్ అలీ, సిఐటియు నగర అధ్యక్షులు బాబు, రాజీవ్ కాలనీ ఉప సర్పంచ్ మసూద్, ఎస్టీ సంఘం నాయకులు సుకుమార్ నాయక్, బీసీ సంఘం నాయకులు ఎండి నాగభూషణం, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు బంగారు భాషా, జాకీర్ హుస్సేన్, మైనార్టీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాక్యుమెంట్ పోయినది

దాక్యుమెంటు నెం:935/2022 నందులో గల ఆస్తిని S.అమానుల్లా S/o Late S.బారాన్ సాబ్, డోర్ నెం:26-4-2546-1, మేళాపురం, హిందూపురం టౌన్ అనంతపురం జిల్లా, ఆధార్ నెం:7988 7952 1538, సెల్:9440591237 అను వారు ఈ క్రింది తెలిపిన వారి నుండి కొన్నారు.
M.A.ఫయాజ్ అహ్మద్ S/o Late M.A.ఖలీల్, గడంగువీధి, పెనుకొండ గ్రామము, అనంతపురం జిల్లా ఆధార్ నెం:8543 7126 3332, సెల:9490121276, పైన తెలిపిన డాక్యుమెంట్ ఎవరికైన దొరికినచో ఈ క్రింది నెంబరును సంప్రదించండి. సంప్రదించిన వారికి పారితోషకము ఇవ్వబడును.
సెల:9440796843, సబ్ ఇన్స్ స్పెక్టర్, సోమందేపల్లి.

In The Court of The Hon'ble Principal District Judge, Ananthapuramu
E.P.NO:148/2023 in A.A.NO:TVS/DA/ARC/2/2022
Between:
M/S TVS Credit Services Ltd, Ananthapuramu ...D.Hr
V/S
1.H.Harijana Malenna,
2.Harijana Mallesh,
3.M.Ramesh ...J.Drs
Notice to J.Drs No:1,2 &3
To
J.Dr No:1: H.Harijana Malenna S/o Harijana Ramappa, D.No:0-19, SC Colony, Jakkala Vadiki (V), Kanekal (M), Ananthapuramu (District),
J.Dr No:2: Harijana Mallesh S/o Harijana Malenna, SC Colony, Ward No:4, Jakkala Vadiki (V), Kanekal (M), Ananthapuramu (District),
J.Dr No:3:M.Ramesh S/o Narasanna , D.No:5-90, BC Colony, Jakkala Vadiki (V), Kanekal (M), Ananthapuramu (District),
పై నెంబరు కేసులో J.Drs అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 25/08/2023వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.HUSSAIN NIZAMI
Advocate for D.Hr
Anantapuramu, Cell:9908935964

In The Court of The Hon'ble Principal District Judge, Ananthapuramu
E.P.No:149/2023 in A.A.No:VM/TVS2242/2019
Between:
M/S TVS Credit Services Ltd, Ananthapuramu ...D.Hr
V/S
1.Boya Palakka,
2.Boya Paatha Linappa,
3.Boya Marenna ...J.Drs
Notice to J.Drs No:2 & 3
To
J.Dr No:2: Boya Paatha Linappa S/o Boya Mareppa, D.No:3-156, Nagireddy Palli (V), Bramhasamudramu (M), Ananthapuramu (District),
J.Dr No:3:Boya Marenna S/o Boya Kondlappa, D.No:3-93 Nagireddy Palli (V), Bramhasamudramu (M), Ananthapuramu (District),
పై నెంబరు కేసులో J.Drs అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 25/08/2023వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.HUSSAIN NIZAMI
Advocate for D.Hr
Anantapuramu, Cell:9908935964

వీధిదీపాలను అందజేస్తున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరేగౌడ్ర మంజునాథ్

వీధిదీపాల వితరణ

రాయదుర్గం : పట్టణంలోని శాంతినగర్, గౌడ లేఔట్‌లకు అవసరమైన వీధి దీపాలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరేగౌడ్ర మంజునాథ్ ఆదివారం కాలనీవాసులకు అందజేశారు. గతవారంలో వరుసగా దొంగతనాలు జరిగిన నేపథ్యంలో ఆయా కాలనీల ప్రజల సౌకర్యార్థం సొంతఖర్చులతో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాయదుర్గం మండల అధ్యక్షులు హర్షవర్ధన్, అజయ్‌కుమార్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నగర కమిటీ ఎన్నిక

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నగర కమిటీ సభ్యులతో ప్రమాన స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నగర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని కృష్ణ కళామందిరంలో మానవతా సంస్థ ఆవిర్భావ, నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రథమ సమావేశం నిర్వహించారు. తొలుత కేంద్ర కమిటీ సహకారం, రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ కె.విజయరాఘవన్ ఆర్థిక సౌజన్యంతో అన్ని సదుపాయాలతో తయారు చేసిన శాంతిరథాన్ని జిల్లా ఉపరవాణా కమిషనర్ ఎం.వీర్రాజు ప్రారంభించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మానవతా జిల్లా ఛైర్మన్‌గా రిటైర్డ్ డిఆర్ఓ రఘునాథ్, కేంద్ర కమిటీ సభ్యులు రాటాల గోపీ, పాలక వర్గ సలహాదారులుగా పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్, కె.విజయరాఘవన్, డి.ప్రభాకర్, పి.వరదరాజుతో ప్రమాణ స్వీకారం చేయించారు. మానవతా నగర అధ్యక్షులుగా పెన్షనర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, ఉపాధ్యక్షులు సీఎం.గంగిరెడ్డి, సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాసులు, కోశాధికారి నాగేశ్వరి, డైరెక్టర్‌లుగా విద్య, నైతిక విలువలు కమిటీ బి.నారాయణ, ఆత్మీయ సహకారం యూ.చంద్రశేఖర్ రెడ్డి, సామాజిక స్పృహ, అవగాహన జి.బి. విశ్వనాథ్, ఉచిత వైద్య సేవలు డాక్టర్ ఏ.జగన్నాథ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కె.విజయ రాఘవన్ మానవతా సంస్థలో 200 మందిని సభ్యులుగా చేర్చిన జాబితాతో సభ్యత్వ నమోదు మొత్తం రూ.1,20,000 జిల్లా ఛైర్మన్, అధ్యక్షులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత రక్తదాన సంస్థ నిర్వాహకులు అమరనాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, సూర్యనారాయణ, సీనియర్ సిటిజన్స్ రమణ రామిరెడ్డి, నంజప్ప, వేణుగోపాల్, సావిత్రి దేవి రాజేశ్వరి, సత్యనారాయణ, మధు, అనంతయ్య, రామమూర్తి, మానవతా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

సిఎం జగన్ పేదలందరికీ అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రభుత్వ సలహాలుదారు ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ఎస్ఆర్ఐటి కళాశాలలో నియోజకవర్గంలోని జెసిఎస్ మండల, సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చెప్పిన విధంగా సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు పార్టీ, ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు దాదాపు 4,800 మందికి బీమా వర్తిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అభివృద్ధి అంటే బిల్డింగులు కట్టడం కాదని, పేదవాడి బతుకు మార్చితే అదే నిజమైన అభివృద్ధి అన్నారు. పేదవాడు పేదరికం నుంచి ఎప్పుడైతే బయటపడతాడో అప్పుడే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. దీన్ని గుర్తించిన సిఎం జగన్ కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీలను అమలు చేయకుండా మోసం చేస్తే, 2019లో ఇచ్చిన మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అందుకే తాము ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.2.5 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.4.1లక్షల కోట్లు అందించారని వివరించారు. నాలుగేళ్లలో శింగనమల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి ఇంటింటికీ వెళితే ప్రతి ఇంటికీ జగనన్న అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, కోకన్వీనర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

జెసి ప్రభాకర్‌రెడ్డివి దిగజారుడు రాజకీయాలు

ఈసారి ఆయనకు టికెట్ రాదు.. : ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెసి ప్రభాకర్‌రెడ్డి లేకపోతే తాడిపత్రి లేదన్నట్టుగా ప్రచారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి టిక్కెట్ ఆయనకు రాదనే భయంతోనే ఫోకస్ అయ్యేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఎన్నికల్లో సానుభూతి కోసం తన చంపి అయినా ఎమ్మెల్యే అవ్వాలన్న ఆలోచనలోనున్నారని ఆరోపించారు. తాడిపత్రి భూములను కాపాడింది ఆయన కాదని, తానని చెప్పారు. అభివృద్ధి చేస్తుంటే కోర్టులకెళ్లి అడ్డుపడుతున్నారన్నారు. రోడ్డు 120 అడుగులకు విస్తరిస్తే ఆయన ఇళ్లు కూడా పడగొట్టాల్సి వస్తుందని చెప్పారు. అందుకు అంగీకరిస్తే విస్తరించడానికి తనకేమి అభ్యంతరం లేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గెలవకపోతే సర్దుకోని హైదరాబాదుకు చేరడానికి కూడా సిద్ధంగా జెసి.ప్రభాకర్‌రెడ్డి ఉన్నట్టు యెద్దేవ చేశారు. ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

బీబీ జైనబ్బీ ఉరుసు పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో ప్రసిద్ధి చెందిన పాక్ దామన్ హాజరత్ సయ్యదున్నీసా బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహా అమ్మవారి ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఇందులో భాగంగా అనంతపురంలోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. సెప్టెంబర్ 13న గంధం, 14న ఉరుసు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు, వైసిపి మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సయ్యదున్నీసా బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహా అమ్మవారి ఉరుసు పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

మహిళకు కరపత్రం అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని 7వ సచివాలయం 4వ వార్డు పరిధిలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని బిటిపి రోడ్డు అంబేద్కర్ నగర్‌లో దళిత భవన నిర్మాణ కార్మిక సేవా సహకార సంఘం కార్యాలయా భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళు శిల్ప, కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్లు శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి,కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, సంజీవప్ప, గోవిందరాజులు, దేవరాజు, అజయ్, ప్రతాప్, మంజునాథ, శివకుమార్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, వలిబాషా, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, శివ, శివప్ప, దివాకర్, బషీర్, రామాంజనేయులు, నిజాముద్దీన్, గోరంట్ల సత్యనారాయణ, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

పుట్లూరు : మండలంలో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు ఉదయాన్నే తలస్నానం చేసి ఒక్కపొద్దుతో పుట్ట దగ్గరికి వెళ్లి ప్రదక్షిణాలు చేసిన అనంతరం పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఉరవకొండ : ఉరవకొండ, విడపనకల్ మండలాలతోపాటు ఆయా గ్రామాల్లో శ్రావణమాసం నాగుల చవితి పర్వదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాగులకట్టలకు పూజలు చేశారు. కొన్నిచోట్ల పుట్టలకు పాలు పోశారు.

డెంగీ, మలేరియా నివారణకు

చర్యలు తీసుకోవాలి

డిఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు అధ్యక్షతన ఆదివారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా దోమకాటు వల్ల మలేరియా వ్యాధి వస్తుందని కనుకొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రోస్ 1857 మే 13వ తేదీన జన్మించారన్నారు. అయన బ్రిటీష్ శాస్త్రావేత్త అయినప్పటికీ సికింద్రాబాద్ మిలిటరీ స్కూల్‌లో డాక్టర్‌గా పని చేసేవారని గుర్తు చేశారు. 1897వ సంవత్సరం ఆగష్టు 20వ తేదీన మలేరియా జ్వరం దోమకాటు వల్ల వస్తుందని, దోమ జీర్ణశయాంతర పేగుల్లో పరాన్నజీవులు ఉన్నాయని కనుగొని నిర్ధారించాడన్నారు. కావున ఈ రోజును మనం ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు. ఈ పరిశోదనకు 1902వ సంవత్సరంలో వైద్యశాస్త్రంలో సర్ రోనాల్డ్ రోస్‌కు నోబెల్ బహుమతి వచ్చిందన్నారు. మలేరియా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని ఋజువు చేసినందున ఈ వ్యాధిని ఎదుర్కొనే పద్ధతికి పునాది పడింది సర్ రోనాల్డ్ రోస్ భారతీయ వైద్య శాస్త్రంలో 25 సంవత్సరాలు పని చేసి సంచలనాత్మక ఆవిష్కరణ చేశారని కొనియాడారు. అనంతరం మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే, వేక్టర్ కంట్రోల్ హైజిన్ నిరంతర ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఏఎన్ఎం, గ్రామ పంచాయతీ సెక్రటరీలు దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. దోమలు, వాటి లార్వా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్రైడే డ్రైడే, వేక్టర్ కంట్రోల్ హైజిన్ యాప్‌ల గురించి ఏఎన్ఎంలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ జేమ్స్, సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, విస్తరణ అధికారి గిరిధర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, మలేరియా విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్